క్లుప్తంగా

పలువురు నేతలను కలిసిన ఎంపీ బోస్


మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావును కలిసిన ఎంపీ బోస్, ఇతర నేతలు

రామచంద్రపురం: రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పట్టణంలోని పలువురు నేతలను వారి స్వగృహాల వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్‌కు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జిగా పార్టీ అధిష్టానం నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని వైఎస్సార్ సీపీ నేతలతో పాటు కౌన్సిలర్లను, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లను ఎంపీ బోస్ గురువారం కలిశారు. ఆయన వెంట పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, పార్టీ నేతలు సత్తి శంకర్‌రెడ్డి, శీలం గంగరాజు తదితరులున్నారు.

దివ్యాంగులపై ఆదరాభిమానాలు చూపాలి

కాజులూరు: సమాజంలో దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ ఆదరాభిమానాలు కలిగి ఉండాలని వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం నేత, కాజులూరు సర్పంచ్ దండంగి సరోజిని అన్నారు. కాజులూరు భవిత కేంద్రంలో గురువారం బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దివ్యాంగుల పాఠశాల ఐఈఆర్పీ ఎం.జయప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ బ్రెయిలీ లిపి వల్ల అంధులకు ఎంతో ప్రయోజనం ఉందన్నారు. ఐఈఆర్పీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

రామచంద్రపురం: మున్సిపల్ కార్మికుల జేఏసీ పిలుపులో భాగంగా రామచంద్రపురంలో మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె రెండో రోజు గురువారం కొనసాగింది. సమ్మె శిబిరాన్ని ప్రజానాట్య మండలి పట్టణ అధ్యక్షుడు గొర్రెల రాము, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం తదితరులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డులతో మెరుగైన వైద్యం


నల్లూరులో ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న పుట్టా కృష్ణమూర్తి

కపిలేశ్వరపురం: ఆరోగ్యశ్రీ కార్డులతో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయం అందుతోందని నూతనంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. నేలటూరు, నల్లూరు, టేకి తదితర గ్రామాల్లో గురువారం ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్య కార్డులతో పేదలకు మేలు కలుగుతుందన్నారు.

మొక్కల పెంపకాన్ని అలవర్చుకోవాలి

అంబాజీపేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడాన్ని అలవాటు చేసుకుని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అన్నారు. ఎస్టీయూ వజ్రోత్సవాల్లో భాగంగా లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో, మండల రీసోర్స్ కార్యాలయంలో గురువారం మొక్కలు నాటారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి వార్షిక అనఘావ్రతం

కొత్తపేట: కోనసీమ షిర్డీగా పేరుగాంచిన స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉన్న గురుదత్తాత్రేయస్వామివారి వార్షిక అనఘావ్రత కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా అష్టమి తిథి రోజున సాధారణ అనఘావ్రతం, మార్గశిర మాసంలో అష్టమి నాడు వార్షిక అనఘావ్రతం ఆనవాయితీగా నిర్వహిస్తారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు గోవిందవఝ్ఝల నరసింహశర్మ, బోడిపాలెం విజయ కనకదుర్గాదేవి, అభయాంజనేయ స్వామివారి ఆలయాల ప్రధానార్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు ఉదయం నుంచి వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, గోపూజ, దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, కలశపూజ జరిపారు. అనంతరం భారీఎత్తున అన్న సమారాధన జరిగింది.

శ్రామికుడికి భరోసా

- ఈ–శ్రమ్ నమోదుతో ప్రయోజనాలెన్నో..
- అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- ఆర్థిక, సామాజిక భద్రతకు దోహదం


ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఈ–శ్రమ్ పథకం శ్రామిక జనావళికి ఆసరాగా నిలుస్తోంది. చిరు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకం రూపుదిద్దుకుంది. క్షేత్ర స్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్మిక శాఖ విశేష కృషి చేస్తోంది.

రెండు నియోజకవర్గాల్లో శ్రామిక శక్తి ఇలా..

మండపేట నియోజకవర్గంలో 43, రామచంద్రపురం నియోజకవర్గంలో 77 మొత్తం 120 గ్రామాల్లో పంచాయతీ కార్మికులు రోజువారీ శ్రమ చేస్తున్నారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని లంక గ్రామాల్లో కొబ్బరి ఒలుపు కార్మికులున్నారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వందలాది మంది అంగన్‌వాడీ, ఆయాలున్నారు. కపిలేశ్వరపురం, మండపేట పట్టణం, కె.గంగవరం మండలాల్లో విస్తారంగా మత్స్యకార కార్మికులు ఉన్నారు. మండపేట, దీని పరిసర గ్రామాల్లో 120కి పైగా రైస్ మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వందలాది మంది కార్మికులు శ్రమిస్తున్నారు. కోళ్ల పరిశ్రమ ద్వారా ఇతర ప్రాంతాలకు గుడ్ల ఎగుమతి సాగుతోంది. మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో సుమారు మూడు వేల మంది వలస కార్మికులు పనిచేస్తున్నారు. రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాల్లో విస్తారంగా భవన నిర్మాణ కార్మికులున్నారు.

పథకం లక్ష్యమిదీ..

వలస, అసంఘటిత రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు స్థానికత, సంఘటిత పరిస్థితులు ఉండవు. వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

ఇవీ ప్రయోజనాలు

కార్మికులకు గుర్తింపు కార్డును జారీ చేస్తారు. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తారు. విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ నమోదు అవసరం. ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమ చేసే వీలుంటుంది.

ఇలా నమోదు చేయాలి

కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు రుసుము చెల్లించనవసరం లేదు. ఉచితంగా వివరాలను నమోదు చేసి, యూనివర్శల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) గుర్తింపు కార్డును జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు. కార్మికుని ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి వద్ద పని చేస్తున్నారో వెల్లడించాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నారో చెబితే సరిపోతుంది. పథకంలో ఒక్కసారి నమోదైతే చాలు. రెన్యువల్ చేయించాల్సిన అవసరం లేదు. వివరాలు శాశ్వతంగా వెబ్‌సైట్‌లో ఉంటాయి.

నమోదు నిరంతర ప్రక్రియ



ఈ–శ్రమ్ నమోదు అనేది సంబంధిత కార్యాలయాల్లో నిరంతరాయంగా నమోదు చేస్తారు. క్షేత్ర స్థాయిలో దీనిపై అవగాహన కల్పిస్తున్నాం.
– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం


అర్హులు వీరే..

16 నుంచి 59 ఏళ్ల నిర్మాణ, వలస కార్మికులు, ఇంటి పనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశు పోషకులు, తోలు, వడ్రంగి, ఉప్పు, ఇటుక బట్టీల కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు.

ఎనీమియా ముక్త భారతే లక్ష్యం

ఆలమూరు: వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీ శంకర్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ అందించారు. ప్రతి గురువారం డ్రాప్స్ అందించనున్నట్టు వైద్యాధికారులు పేర్కొన్నారు.

వైభవంగా కాలభైరవాష్టమి పూజలు


కాలభైరవాష్టమి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

ఆలమూరు: జొన్నాడలో ఉన్న అన్నపూర్ణ సమేత దక్షిణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం కాలభైరవాష్టమి పూజలు వైభవంగా జరిగాయి. శ్రీశోభకృత్ నామ సంవత్సర మార్గశిర బహుళ అష్టమి రోజున ఈ కాలభైరవ జయంతిని జరపడం ఆనవాయితీగా వస్తోంది. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య ఆలయ కమిటీ పర్యవేక్షణలో పురోహితులు పూజలు నిర్వహించారు. ఈ కాలభైరవాష్టమి పూజలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్
- పెంచిన పింఛన్ల పంపిణీ


కూర్మాపురంలో పింఛను అందజేస్తున్న పృథ్వీరాజ్

రాయవరం: నాడు తెలుగుదేశం ప్రభుత్వ పాలన, నేడు వైఎస్సార్ సీపీ పాలనకు తేడాను ప్రతి ఒక్కరూ గమనించాలని, ప్రజల కోసమే పని చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. కూర్మాపురంలో పెరిగిన పింఛన్ల సొమ్ము పంపిణీ సర్పంచ్ చౌటుపల్లి చక్రవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యువనేత పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మేలు జరిగిందో ఆ విషయాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం పేదలకు సాయం చేసే ప్రభుత్వమని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు మాట్లాడారు. అనంతరం నెలవారీ సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, చౌటుపల్లి వెంకటేశ్వరరావు, పరంశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి సూర్యనారాయణ, కొలగాని సత్తిబాబు, లక్ష్మణరావు, రామ్మూర్తి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాచవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


మాచవరంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మాచవరంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డిలతో కలిసి గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పింఛన్ల మంజూరు, పంపిణీలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి పింఛను అందించడమే ధ్యేయంగా, పూర్తి పారదర్శకంగా పింఛన్ల పంపిణీ చేపట్టారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తూ పూర్తి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ త్రిమూర్తులు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేసిన సంక్షేమం, అభివృద్ధి వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు వెంట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నేత వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీ పలివెల శోభన, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లిడి రామారెడ్డి, మండల సచివాలయ కోఆర్డినేటర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కత్తుల అప్పారావు, వెలగల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు భరోసా


ఏడిదలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట
- పెరిగిన పింఛన్ల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): పేద, మధ్య తరగతి ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆసరానిస్తుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రూ.3వేలకు పెంచిన పింఛన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండపేట మండలం ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాల్లో సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, వరదా చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పేద, మధ్య తరగతి ప్రజలకు పింఛన్లను అందజేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో పింఛన్లను అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు మాట్లాడుతూ పింఛన్లు పంపిణీని రాజకీయం చేస్తూ ప్రతిపక్షాలు కాలం వెళ్లబుచ్చుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పలివెల సుధాకర్ పాల్గొన్నారు. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట తనయుడు, యువనేత పృథ్వీరాజ్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, జెడ్పీటీసీ కుడుపూడి భవాని, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ చేతుల మీదుగా పింఛను సొమ్మును అందజేశారు.

నేలటూరులో ...

నేలటూరులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా పింఛన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కులం, మతం, రాజకీయాలను చూడకుండా పారదర్శకంగా పింఛన్లను అందజేస్తున్న ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. సామాజిక న్యాయానికి పట్టుకొమ్మలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడి పాలన సాగుతుందన్నారు.

విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ


మారేడుబాకలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): మారేడుబాకలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గీయుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ చొల్లంగి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు చొల్లంగి రాజశేఖర్ పాల్గొన్నారు. విశ్వ బ్రాహ్మణ సామాజిక వర్గీయులు మాట్లాడుతూ తమ దీర్ఘకాలిక ఆకాంక్షను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో నెరవేర్చారని సంతోషం వ్యక్తం చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో కృషి చేస్తున్నామన్నారు.

పింఛను పెంపుతో హామీలన్నీ పూర్తి

ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బోస్. చిత్రంలో వైఎస్సార్ సీపీ నూతన కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో సామాజిక పింఛన్లను రూ.మూడు వేలకు పెంచడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు పూర్తి స్థాయిలో అమలు చేసినట్టయిందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నూతన కోఆర్డినేటర్ అయిన తన కుమారుడు పిల్లి సూర్యప్రకాశ్‌తో కలసి రామచంద్రపురం అర్బన్, రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి గురువారం రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బోస్ మాట్లాడుతూ తన కుమారుడు ఇకపై ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలోనూ పాల్గొంటారన్నారు. పెంచిన పింఛను పంపిణీ తదితర కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించుకుని ఆయనకు తెలియజేయాలని సూచించారు.

విజయవంతం చేయాలి : సూర్యప్రకాశ్

నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ నూతనంగా పెంచిన పింఛన్ల పంపిణీ, ఆరోగ్య సురక్ష 2.0, ఆడుదాం ఆంధ్రా తదితర కార్యక్రమాలను అధికారులు ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, వనుము సుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, డీఎల్‌డీఓ ఎ.శాంతి, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓలు ఎన్.కీర్తిస్పందన, ఎస్.శ్రీనివాసరావు, రత్నరాజు, ఈఓపీఆర్డీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాడి పశువులకు వ్యాక్సినేషన్ ప్రారంభం


వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్న ప్రతి పాడి రైతు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పశువులకు టీకాలు వేయించాలని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని కుందూరులో గురువారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు 14,450 డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. పశు వైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తారని పేర్కొన్నారు. ఏడీ రామకృష్ణ, సర్పంచ్ పంపన సత్యానందం, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, పశు వైద్యులు జీవన్ జ్యోతి, సంయుక్త, బిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

రాయవరం: మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్టు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. పింఛన్ సొమ్ము ఈ నెల రూ.2,750 నుంచి రూ.3వేలకు ప్రభుత్వం పెంపుదల చేసినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు పసలపూడి, 10 గంటలకు సోమేశ్వరం, లొల్ల ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు చెల్లూరులో పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నారులు.. పెద్ద మనస్సులు

వృద్ధులకు చీరలు, పండ్ల పంపిణీ


గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సర్పంచ్ పెద్దబ్బాయి, హెచ్ఎం రాంబాబు తదితరులు

రాయవరం: వారంతా విద్యార్థులు. పాఠశాలలో నైతిక పాఠ్యాంశాలను, మానవతా విలువలను నేర్చుకున్నవారు. వాటిని నిత్య జీవితంలో పాటించి పలువురి మన్ననలు పొందారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్‌థెరిసా సూక్తిని ఆచరణలోకి తీసుకొని వృద్ధులకు సాయం చేశారు. వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారు పొదుపు చేసుకున్న సొమ్ము రూ.25వేలతో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్ఎం పోలిశెట్టి రాంబాబు నేతృత్వంలో వాటిని అందజేశారు. మదర్ థెరిసా సేవా సమితి కోఆర్డినేటర్ పాఠశాల పీఎస్ టీచర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన 25 మంది మహిళలకు చీరలు, పండ్లు సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి చేతుల మీదుగా అందజేశారు. ఐదుగురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉన్న విద్యార్థులు జి.లక్ష్మీగణ పూజిత, ఎస్.నీలవేణి, ఉపాధ్యాయులు శ్రీపెరంబుదూర్ సూరిబాబు, చంద్రమౌళి, దుర్గారావు, గాయత్రిదేవి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


సీనియర్ ఓటర్లను సన్మానించిన తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ


ద్రాక్షారామ సచివాలయంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

కె.గంగవరం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ కోరారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం సీనియర్ ఓటర్లకు సన్మానం నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల ఆవరణలో ఓటు హక్కు ప్రాధాన్యం, ఓటర్లను చైతన్య పరిచేందుకు అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఓటర్లందరూ ఓటు వేసేందుకు సమాయత్తం కావాలన్నారు. యువత ఓటు హక్కు వినియోగించడంలో ఆలసత్వం వహిస్తున్నారని, ఈసారి మాత్రం ప్రతిఒక్కరూ ఓటు వేసి రాజ్యాంగ స్ఫూర్తిని చాటాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 17 మంది సీనియర్ ఓటర్లను సత్కరించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పక్కి బ్రహ్మానందం, నందూరు భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఓటర్లకు సత్కారం

రామచంద్రపురం రూరల్: ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ఆధ్వర్యంలో గురువారం ద్రాక్షారామ గ్రామ సచివాలయంలో ఎన్నికల అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 80 ఏళ్లు పైబడి, సార్వత్రిక ఎన్నికల్లో 8 కంటే ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ ఓటర్లను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. వారి అనుభవాలను సభలో పంచుకున్నారు. అనంతరం ఈవీఎంల పనితీరు, ఓటు హక్కు వినియోగించుకునే విధానం, వృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల్లో కల్పించే ప్రత్యేక సౌకర్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కర్రి మహాలక్ష్మి నాయుడు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వీఆర్ఓ కాకినాడ సాయిబాబు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు భయాందోళన వద్దు


సదస్సులో మాట్లాడుతున్న పీడీ జ్యోతిలక్ష్మీదేవి

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎదుర్కొనే విద్యార్థులు భయాందోళనకు గురికావద్దని ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి అన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించడంపై గురువారం ప్రేరణ అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి పరిధిలోని తొమ్మిది వసతి గృహాలకు చెందిన 140 మంది విద్యార్థులు సదస్సుకు హాజరయ్యారు. ఏఎస్‌డబ్ల్యూఓ కేవీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎస్సీ సంక్షేమ శాఖ పీడీ పి.జ్యోతిలక్ష్మి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం పీడీ జ్యోతిలక్ష్మీదేవి మాట్లాడుతూ పరీక్షల్లో మెళకువలు, మోడల్ పేపర్లకు అన్సర్ చేయడం, సమయపాలనపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు నాగరాజు, నాగేంద్రకుమార్, హనుమంతరావు, ఎం.శ్రీను, ఆనందకుమార్ విద్యార్థులకు పలు సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. హెచ్ఎంలు సుభాషిణి, సరస్వతి, రామచంద్రపురం, అమలాపురం ఏఎస్‌డబ్ల్యూఓలు ఎస్.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, వసతి గృహాధికారులు పాల్గొన్నారు.